# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో విమాన ప్రయాణికుల సంఖ్య మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

2. **పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల విశ్వాసం పెంచేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు వైద్యులకు సూచించారు.**

3. **రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా పలు జిల్లాలో భారీ నష్టం వాటిల్లిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

4. **అపరిష్కృతంగా ఉన్న కేసుల పరిష్కరణే లక్ష్యంగా ఈ రోజు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.**

5. **తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తిరుమల తిరుపతి దేవస్థానం..టీటీడీ కార్యనిర్వహణాధికారి జె.శ్యామలారావు వెల్లడించారు.**

==========================

రాష్ట్రంలో విమాన ప్రయాణికుల సంఖ్య మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయంలో అప్రోచ్ రహదారిని, విజయవాడ-ఢిల్లీ ఇండిగో విమాన సర్వీసును ఈరోజు ప్రారంభించిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. 3 నెలల్లోనే 4 కొత్త సర్వీసులు ఏర్పాటు చేశామని.. వచ్చే నెల 26వ తేదీన విజయవాడ నుంచి పుణెకు.. 27వ తేదీన విశాఖపట్నం నుంచి ఢిల్లీకి విమాన సర్వీసు ప్రారంభించనున్నామని వెల్లడించారు. ఏడాదిలోగా గన్నవరం ఎయిర్‌పోర్టు కొత్త టెర్మినల్ ప్రారంభిస్తామని.. దేశంలో కొత్తగా మరో 200 విమానాశ్రయాల ఏర్పాటు లక్ష్యంగా కృషి చేస్తున్నామని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

--------------------------

రాష్ట్రంలోని పరిశ్రమల్లో భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం కోసం విశ్రాంత ఐఏఎస్ అధికారి వసుధా మిశ్రా ఛైర్‌పర్సన్‌గా ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో వివిధ శాఖల అధికారులు, సెజ్ నిర్వాహకులకు చోటు కల్పించారు. ఈ కమిటీ రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని భాగస్వామ్య పక్షాలతో సమావేశాలు నిర్వహిస్తుంది. వారి నుంచి సేకరించిన వివరాల ఆధారంగా

రెండు మూడు నెలల్లో తన సిఫారసులను ప్రభుత్వానికి నివేదిస్తుంది.

---------------------------

పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల విశ్వాసం పెంచేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి ప్రభుత్వ అసువత్రిలో నిర్మాణాలకు స్థలాన్ని ఈరోజు పరిశీలించిన ఆయన సోమవారం నుంచి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్యులు తమ విధులను మరింత బాధ్యతతో నిర్వహించాలని కోరారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో ఎక్కడా రాజీపడకూడదని దిశానిర్దేశం చేశారు.

---------------------------

రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా పలు జిల్లాలో భారీ నష్టం వాటిల్లిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. లక్షలాది మంది ప్రజలు ముంపు బారిన పడ్డారని, ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టిందన్నారు. బుడమేరు, ఏలేరు పరీవాహక ప్రాంతాలు భవిష్యత్‌లో ముంపు బారిన పడకుండా చర్యలు చేపడుతున్నామని మంత్రి వివరిస్తూ..

...వాయిస్ (32 సెకన్లు)

---------------------------

హైదరాబాద్– విజయవాడ మధ్య 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణ విస్తీర్ణం మరింత పెరగనుంది. తొలుత ఈ రహదారిని హైదరాబాద్ సమీపంలోని దండు మల్కాపూర్ నుంచి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి వరకు విస్తరించాలనుకున్నా ప్రస్తుతం గొల్లపూడి వరకు పెంచాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ నిర్ణయించింది. తొలుత దండు మల్కాపూర్ నుంచి జగ్గయ్యపేట వరకు విస్తరణ పనులు చేపట్టేందుకు వీలుగా 181.5 కిలోమీటర్లకు సవివర నివేదిక..డీపీఆర్ రూపొందించాలని ఆదేశాలు జారీచేశారు. తాజాగా గొల్లపూడి వరకు విస్తరించాలని నిర్ణయించి మరో 40 కిలోమీటర్ల పెంపును దృష్టిలో పెట్టుకుని డీపీఆర్ తయారు చేయించాలని నిర్ణయించారు. దీనికి ఈ నెల 24వ తేదీని తుది గడువుగా నిర్ణయిస్తూ కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ టెండర్లను ఆహ్వానించింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

అపరిష్కతంగా ఉన్న కేసుల పరిష్కరణే లక్ష్యంగా ఈరోజు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం వల్ల విలువైన సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని ప్రకాశం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా

ఒంగోలులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ బెంచ్‌లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా మొత్తం 25 బెంచ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశం వినియోగించుకుని లోక్ అదాలత్ లో తమ కేసులు పరిష్కారం చేసుకోవాలని కోరారు. చిత్తూరునగరంలోని కోర్టు సముదాయాల్లో జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయాధికారి ఇ.భీమారావు ప్రారంభించారు. చిత్తూరు జిల్లా న్యాయసేవాసంస్థ ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలోని ఐదవ సెషన్స్ కోర్టులో లోక్ అదాలత్ జరుగుతోంది. తిరుపతిలోని కోర్టు సముదాయాల్లో జాతీయ లోక్ అదాలత్‌ను మూడవ అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ ప్రారంభించారు. తిరుపతి జిల్లా న్యాయసేవాసంస్థతో పాటు మండల స్థాయి సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ జరుగుతోంది.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 16వ తేదీన గుజరాత్ పర్యటనకు వెళ్లనున్నారు. కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో జరిగే 4వ గ్లోబల్ రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్, ఎక్స్‌పో.. ఆర్‌ఈ-ఇన్వెస్ట్ 2024లో ఆయన పాల్గొంటారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ ప్రారంభ ఉపన్యాసం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలు భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి.

---------------------------

వృద్ధ పింఛనుదారులు తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్..డీఎల్‌సీను ఇంటి వద్దే సమర్పించ వచ్చుని తపాలా శాఖ పేర్కొంది. అందుకోసం ఇంటి వద్దకే సేవలు అందించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నామని తెలిపింది. జిల్లా తపాలా కార్యాలయాల్లో స్మార్ట్ ఫోన్ల ద్వారా ముఖ ఆధారిత విధానంలో పింఛనుదారులు డీఎల్‌సీలను సమర్పించవచ్చుని, అలాగే ఇంటివద్దకు కూడా తపాలా సేవలు అందిస్తామని అధికారులు పేర్కొన్నారు. పింఛను, పింఛనుదారుల సంక్షేమ శాఖ..డీవోపీపీడబ్ల్యూ అన్ని జిల్లా కేంద్రాలు, ముఖ్యమైన నగరాల్లో నవంబరు 1 నుంచి 30వ తేదీ వరకు 'డీఎల్‌సీ క్యాంపెయిన్ 3.0'ను నిర్వహించనుంది. ఈ సందర్భంగా పింఛనుదారుల సంక్షేమ సంఘాలు, పింఛను పంపిణీ చేసే బ్యాంకులు, ఆధార్, సంబంధిత సంస్థలతో తపాలా కార్యాలయాలు సమన్వయం చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తిరుమల తిరుపతి దేవస్థానం..టీటీడీ కార్యనిర్వహణాధికారి జె.శ్యామలారావు తెలిపారు. వచ్చే నెల 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాట్ల పురోగతిపై టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి ఈ రోజు ఆయన వివిధ శాఖల అధికారులతో తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం శ్యామలరావు పాత్రికేయులతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో ద్విచక్రవాహనాలను రెండు ఘాట్ రోడ్లలో అనుమతించబోమని తెలిపారు. అక్టోబర్ 8వ తేదీన గరుడ వాహన సేవ జరుగనున్న నేపథ్యంలో గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు అన్నపానీయాలను అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి.శేష సాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....20 సెకన్లు....

======================